# వినాయకచవితి 'కాలమ్ దాటని కథల' పోటీలో ఎన్నికైన కథలు

## పెన్ ఫ్రెండ్

"ఆ వెళ్ళే అమ్మాయి నా పెన్ ఫ్రెండ్" అంటూ అటువైపు తర్జనిని చూపించాడు కాంతారావు. చాలా అందంగా వుందా అమ్మాయి. వయ్యారంగా నడుచుకుంటూ వెడుతోంది.

"నాకు పరిచయం చెయ్యవా బాస్?" అన్నాను నేను. మేమిద్దరం హెడ్ పోస్టాఫీసు కారిడార్‌లో నిలబడి వున్నాం.

"డోన్ట్ బి స్టుపిడ్!" అంటూ కోపంగా వెళ్ళి పోయాడు కాంతారావు. నాకు వళ్ళు మండి పోయింది. 'పోరా బాస్టర్డ్! నువ్వు చెయ్యకపోతే ఏమయిందంటా? నేనా అమ్మాయిని పరిచయం చేసుకోలేననుకున్నావా ఇడియట్?' అనుకున్నాను.

అవకాశం కోసం పొంచి చూస్తున్నాను. అది నన్ను వెనువెంటనే కరుణించి దీవించింది. ఆరోజు పోస్టాఫీసు లోకి అడుగు పెడుతున్న నాకు "ఎక్స్యూజ్ మీ! మీ పెన్నోసారి ఇస్తారా?" అన్న కోకిల కంఠం వినిపించి తల తిప్పి చూశాను. ఆ కోకిల... అందాల రాశి మావాడి పెన్ ఫ్రెండ్! "ష్యూర్! విత్ ప్లెజర్" అంటూ... కాప్ తీసుకుని పెన్ను ఇచ్చాను. "నేను ఎత్తుకుపోతానని భయమా?" అందామె తియ్యగా.

సిగ్గుపడి "నో. నో.. నో" అంటూ కాప్ కూడా ఇచ్చేశాను.

"థాంక్స్" అంటూ ఆమె ఉత్తరం మీద అడ్రసు రాసి పోస్టు బాక్సులో వేసి అటు నుంచి అటే వెళ్ళి పోసాగింది.

"ఏమండోయ్ నా పెన్ను!" అని అరవటం సభ్యతగా వుండదని ఆమె వెంట బడ్డాను నేను. ఒకసారి నాకేసి చూసి వడివడిగా అడుగులు వేయసాగిందామె. నేనూ నడక స్పీడు పెంచాను.

ఆమె ఓ ఇంట్లోకి వెళ్ళింది. నేనూ అనుసరించాను.

"రండి లోపలికి. కాఫీ తీసుకు వెడుదురుగాని" అంది. ఆ మర్యాదకి నేను తబ్బిబ్బయి పోయి... ఆమె చూపించిన సోఫాలో కూర్చున్నాను.

కాఫీ తెచ్చిఇచ్చి లోపలికి వెళ్ళింది. 'ఎవరూ ఉన్నట్టు లేరే'... అనుకున్నాను నేను కాఫీ తాగుతూ. ఎవరూ లేకపోతే తలుపులు అంతకు ముందే ఎలా తీసి వుంటాయ్ అని నన్ను నేను సమాధాన పరుచుకున్నాను. నాలో ఆమె మీద కాంక్ష చెలరేగుతోంది.

"ఓ ఫిఫ్టీ ఛేంజ్ దొరుకుతుందా... మీ దగ్గర?" అంది లోపల్నుంచి వచ్చి.

పర్సు తీసి మంత్రముగ్ధుడిలా అయిదు పదుల నోట్లిచ్చానామెకి.

"వన్ మినిట్" అంటూ వెళ్ళిందామె.

"ఒకసారి లోపలికి రండి. ఈ పర్సు జిప్ రావటం లేదు" అంది.

లోపలికి దూకాను నేను. అంతా చీకటిగా వుంది గదిలో. "ఎక్కడ మీరు?" అన్నాను.

"ఇక్కడ" అందామె గాజులు చప్పుడు చేస్తూ. అంతే! ఆమెను అమాంతం వాటేసుకుని... ఆ పక్కనే వున్న మంచం మీద పడేశాను. నేను ఆనందం జుర్రుకుంటుంటే...ఆమె పూర్తిగా సహకరించింది.

నేను లేవగానే కృతజ్ఞతగా సంతోషంగా అన్నాను. "ఆ యాభై మీరుంచుకోండి... నా పెన్ను మాత్రం తిరిగి ఇచ్చెయ్యండి"

"ఊహూ! మీరు నా పెన్ ఫ్రెండ్ నంబర్ ట్వంటీ! ఇక మీరు వెళ్ళి రండి" అంది నన్ను చేతుల్తో బలంగా బయటికి నెట్టేస్తూ.

నీ పెన్ ఫ్రెండ్‌ని పరిచయం చెయ్యరా అంటే... 'డోన్ట్ బి స్టుపిడ్" అని కాంతారావెందుకన్నాడో అప్పుడర్థమయ్యింది నాకు. ప్చ్! ప్చ్!ప్చ్!

-వడ్లమన్నాటి కుటుంబరావు

## స్ట్రాంగ్ టీ!

కాలేజీ వదిలారు.

కాచిగూడా చౌరస్తా దగ్గిర బీటు కానిస్టేబిల్‌లా నిలబడ్డాడు జగన్. కాలేజిలోంచి బయటకొస్తున్న అమ్మాయిల్ని నఖశిఖ పర్యంతం పరిశీలిస్తూ కళ్ళతో తినేస్తున్నాడు. రోడ్‌సైడ్ రోమియోగా ప్రసిద్ధికెక్కిన జగన్‌ని చూస్తే అమ్మాయిలే కాదు, ఆఫీసుల కెళ్ళే ఉద్యోగినులు, ఇళ్ళలో వుండే గృహిణులు కూడా భయపడతారు.

చూస్తున్నాడు జగన్.

"మంచి శాల్తీ ఎక్కడా కనబట్టం లేదు! ప్చ్... పెదవి విరిచాడు. చూశాడు. కంటి మెరుపులో, పెదవి విరుపులో 'సిల్క్‌స్మిత'ను తలదన్నేట్టుగా వుంది.

మెల్లగా దగ్గరకు వెళ్ళాడు. ఆమెను కళ్ళతోనే పలకరించాడు. ఆమె తియ్యగా స్పందించింది. ఫరవా లేదనుకున్నాడు. మాటల్లోకి దించి ఆమె వివరాలన్నీ తెలుసుకున్నాడు. యూనివర్సిటీ స్టూడెంట్‌లా కనిపిస్తున్న జగన్‌తో ఆమె తను బి.య్యే. చదువుకున్నానని, ఉద్యోగాల వేటలో వున్నానని చెప్పింది.

"ఇఫ్ యు డోంట్ మైండ్, లెటజ్ హేవ్ టీ!" అంటూ టూరిస్టు హోటల్ వేపు చూపించాడు.

ఆమె చిరునవ్వుతో అతన్ని అనుసరించింది. ఫామిలీ సెక్షన్ లోకి వెళ్ళి కూర్చున్నారు. 'టీ'కి ఆర్డరిచ్చాడు.

'టీ' వచ్చింది.

టీ తాగుతూ మెల్లగా ఆమె నడుం మీద చెయ్యి వేశాడు. ఆమె సుతారంగా ఆ చెయ్యి తీసేస్తూ "ఛీ! ఎవరైనా చూస్తారు!" అంది అతని కళ్ళలోకి చూస్తూ.

ఆ చూపుతో తాననుకున్నది సాధించగలననే నమ్మకం కలిగింది జగన్‌కి. "ఎక్కడికయినా వెళ్దాం డియర్!" అంటూ ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

"ఎక్కడికో ఎందుకు? నా రూము చూపిస్తాను. మీరు ఎప్పుడయినా రావొచ్చు."

"ఏ రూమా? ఎక్కడ?" అడిగాడు ఆశ్చర్యంగా.

"నింబోలి అడ్డ. ఈ పక్కనే!"

పరమానంద పడిపోయాడు జగన్. 'ఇవాళ చక్కటోక తొక్కాను' అనుకున్నాడు మనసులో. బయటికి వచ్చారు. ఇద్దరూ నడుస్తున్నారు. నింబోలి అడ్డ పోలీస్ స్టేషన్ వరకూ వచ్చారు.

పోలీస్ స్టేషన్ దగ్గర టక్కున ఆగింది ఆ అమ్మాయి.

"ఇక్కడెందుకు ఆగావ్?"

"ఇక్కడో స్ట్రాంగ్ టీ తీసుకుని వెళ్దువు గాని!" అంటూ జగన్ మెడ మీద చెయ్యేసి ఒక్క తోపు తోసిందా అమ్మాయి. ఆ దెబ్బకు వెళ్ళి ఎస్.ఐ. కాళ్ళ దగ్గిర పడ్డాడు జగన్. అప్పుడర్థమయింది అతనికి ఓ మహిళా కానిస్టేబిల్ అని.

మరుక్షణంలో లాకప్‌లో వున్నాడు జగన్ తన తెలివి తక్కువ తనానికి తల బాదుకుంటూ.

—పంతగడ గణేశ్ శంకర్
విద్యార్థి

ఈ బహుమతి పొందిన రచనలలో మీకు నచ్చిన కాలమ్ దాటని కథ వివరాలు దిగువ ఇచ్చిన కూపన్‌లో నింపి, పోస్ట్ కార్డుపై అంటించి మా కార్యాలయానికి పంపండి.

- ఎడిటర్

ఈ సంచికలో నాకు నచ్చిన కథ: ____________________

రచయిత/ రచయిత్రి: ____________________

పేజీ నంబరు: ____________________